

# కలహభోజనుడు

## కవితిలక పులవర్తి కమలావతీ దేవి

—:0:—

ట్రవునుహాలు కిటకిట లాడుతున్నది ప్రజలతో. ఇసుక వేస్తే రాలకుండా వున్నారు ప్రజలు. మన వూళ్లో ఏదో రాగి శాసనం దొరికిందట. అది అపూర్వమైన విషయాల్ని తెలియ జేస్తున్నదట. దాని విషయమై నేటిసభ సమావేశపరుపబడినది అని ఎవ్వరి నోట విన్నా ఆమాటలే వినబడుతూ యున్నవి. అనంతపురంనుండి అరవై రూపాయలు తగలేసుకొని అనంతమూర్తుల నారాయణరావు అనే రీసెర్చి సభ్యుడు అమాంతంగా వుపన్యాసం వినడానికి దయచేశాడు. ఈ మహాజన సభ చూచేసరికి ఉపన్యాసకుడైన గుండె హడలు శ్యామల రావుగారికి జెలసా (కులాసా) ఎక్కువైనది. పది Loud స్పీకర్లంత గొంతుకతో ఉపన్యాసం బనాయించాడు. "నాయనలారా! అమ్మ తల్లులారా! (సభలో కిచకిచలు) రీసెర్చి అంటే సామాన్య విషయం గాదు. ఎంత ప్రేయిను పవరుండా లనుకొన్నారు? (సభలో విశ్వబ్రాహ్మణులు "ఏడిశావులే! మేక కున్నంత మెదడైనా లేదు నీకు. ఆరంభించు నీ గోలకొండ డచ్చీలు") మొన్న పుత్సావారి కట్టడములలో. దొరికిన రాగి రేకు నారదునకు బిరుద మెట్లు వచ్చినదో తెలియ జేయుచున్నది. అది చెపుతా వినండి. ఒకానొక రోజున మెల్లిగా తల్లిదగ్గిర చేరాడు నారదుడు. ఒక బుల్లి గిల్లికజ్జా పెడదామనుకొన్నాడు. ఆ కాలములో తీగలేని టెలిగ్రాము (వైరులెసు టెలిగ్రాము) లేదు. అపుడు వార్తలు కావలెనంటే నారదుడే మెడ్రాసు మెయిలు. సరస్వతితో నారదు డిల్లా అన్నాడు: "అమ్మా! అమ్మా! ఏమిచెప్పను? భూలోకం అంతా తిరిగాను. "హరహర" అనేవాడు "హరిహరి" అనేవాడేగాని అమ్మ మొగుడిని తలచేవాడే



కాడు." "అమ్మ మొగు డెవడురా?" అన్నది సరస్వతీదేవి. "కాదే అమ్మా మా నాన్న. బ్రహ్మదేవుడి కుండే, హిందూదేశమంతా తిరిగినా ఒక గుడియైనా లేదే. మా నాన్న వట్టి తెలివి తక్కువవాడు. కష్టపడి అందరిని ఆయన పుట్టిస్తేగదా శివ కేశవులకు పని. అటువంటప్పుడు యీయన యింత యంబ్రహ్మ లాగున్నాడు కాబట్టే బ్రహ్మదేవు డన్నారు యీయనను. నాకుగూడా సిగ్గేస్తుందే ఎక్కడకన్నా వెళ్ళడానికి." ఇంకేముంది సరస్వతి ఆరోజురాత్రి గదిలో అలిగి పడుకొంది. అర్ధరాత్రి రివిన్యూ కోర్టులో గుమస్తాలాగు పండ్రెండు గంటలదాకా పనిచేసి తయారయ్యాడు తాతగారైన ధాతగారు కార్యం గదిలోకి. బ్రహ్మదేవుడి కర్ధరాత్రిదాకా పనివుందా యని సభ్యులలో గుసగుసలు "నాయనలారా! కాస్త అనుకొనే మాట లేవో గట్టిగా అనండి. ఆయన ఎంత అర్ధరాత్రిదాకా పని చేయకుంటే, కరువుకు చచ్చినంత మంది యీ రెండు నెలలలో యీ వూళ్ళో పుట్టారో మునిసిపలు లెఖ్ఖలు తనిఖీచేయండి. ఏ అమ్మను చూచినా అరడజను పిల్లలకు తక్కువ లేరుగదా? అందుకనే నేను మొదట అమ్మ తల్లుల్లారా! అని సంబోధించాను." అపుడు పక పక లాడారు. రీసెర్చి సభ్యుడు పొల్లుమాట రానిస్తాడా?

(తాతగారికి గదెందుల కని గుస గుసలు) "అది నన్నడిగితే నేనేమి చెప్పేది. ఈ వూళ్ళోనే భవానీ శంకరం అనే ఆయన వున్నాడు. ఆయన్నడగండి ఆయనకు ఏబదియేండ్లు నిండాయి. ఓవరుసీయరు చదివే అల్లుడు సెలవుల కింటికి వస్తే పిప్పళ్ళ బస్తాలాంటి కూతురికి, గామాశాండోలాంటి అల్లుడికి గది యీయక (ఆయన యింట్లో రెండవ పడకగది లేదు లెండి) ఆయన గదిలోకి వెడతా డెందుకో. ఇటువంటి కుళ్ళంకలు వస్తే ఉపన్యాస మాగిపోతుంది. ఉపన్యాసమైపోయాక అడగండి. తెలిస్తే చెపుతాను. తెలియకపోతే కారు ఎక్కి తుఱ్ఱుమంటాను.

ఉభయ తారక మవుతుం దప్పాను. ఇంతకు చెప్పవచ్చే దేమిటంటే సరస్వతి పూరాగా ముసుగెట్టుకొని నిగడ దన్నుకొని పడుకొంది. తాతగారు కితకిత లెట్టారు. కదలలే. ముద్దెట్టుకున్నారు. మెదలలే. ఏదో మూడిందని అర్థమైంది. మూడు రూపాయల కోక తేకపోతే భార్య అలిగి పడుక్కొందని ముప్ఫయి రూపాయల జీతం తెచ్చే గుమస్తా గాడికే అర్థమవుతూ వుండగా చతుర్వేదాలు తలక్రిందుగా చదివే ధాతకు తెలియదూ? అతడేమి చవట గనుక నాగ్రహించక పోవడానికి. కోరిక తీరుస్తా నన్నాడు. లాలించాడు. మెల్లిగా చెప్పింది సంగతంతా. శివుడికి కేశవుడికి పూజేమి? నీ కెంకుకు లేకపోవాలి అని పుస్నెక్కించింది. కొందరు ప్లీడరు గుమస్తాలు మైనార్టీ వదలిన వెంటనే ఆస్తి పంపకంకోసం వ్యాజ్యం వేయమని తమ్ములను పురికొల్పినట్లు. సరే! ఏమి చేయమన్నావు? అన్నాడు తాత. ఇటువంటి వ్యవహారాల్లో మొగవాళ్ళ బుద్ధి జోరుగా వెళ్ళదుగా. సరస్వతి నాన్ కోఆపరేషను బోధించింది. తనలాగే ముసుగెట్టుకొని నిగడదన్నుకొని పడుకుంటే ఇక జననాలుండవు. జననాలుండకుంటే శివకేశవు లేమి చేస్తారో చూద్దాము. అపుడు గాని మీగొప్ప లోకానికి శివకేశవులకు బోధపడదంది. ఆలాగే చేశాడు బ్రహ్మన్నయ్య. అక్కడనుంచి వెళ్లాడు నారదులవారు విష్ణులోకానికి. చల్లగా విష్ణువుతో అన్నాడుగదా "నారాయణా! సకల చరాచర ప్రపంచాన్ని పుట్టిస్తానని గర్వము బ్రహ్మకు, లయం చేస్తానని శివుడికి వుంది. నీమాట ప్రపంచంలో తలపెట్టేవారే లేరు.

త్రాచుపాములాగు లేచాడు నారాయణుడు. సాత్త్విక భావం అంతా విడిచేసి కొందరు సాధువులు భిక్షంపెట్టనపుడు ఆగ్రహం తెచ్చుకొనేటట్టు, "ఏమీ! నా ప్రతాపం చూపిస్తా. నేను పడుకొంటా. జీవకోట్లెట్లా జీవనం చేస్తారో" అని ముసుగెట్టుక తయారయ్యాడు పడక గదిలోకి. ఇక శివుడిదగ్గర కెళ్ళాడు. "అయ్యా! నిన్ను చూస్తే జాలేస్తుంది. నీవు శ్మశానాల్లో వుంటావు. నవుఖరులా భూత ప్రేత పిశాచాలు. వృత్తియూ భిక్షము. అందరిని చంపేస్తావనిన్నీ దుర్మార్గుడవనిన్నీ ప్రజలు నిన్ను దుష్కీర్తి పోస్తున్నారు. బ్రహ్మ పుట్టిస్తాడట. విష్ణువు పోషిస్తాడట. నీవుమాత్రం పరమ కిరాతుడవట. రాతిగుండెవాడవట" అన్నాడు నారదుడు. "వాళ్ళ కర్మం. నేను గనుక కాస్తసేపు యూరకుంటినా మూడేళ్లకల్లా రికార్డులు తగలెయ్యకపోతే రికార్డురూములు ఏలా పిక్కటిల్లిపోతాయో ఆలా లోకంలో జనులు పిక్కటిల్లి ఒకళ్ళ నొకళ్లు తలలు బద్దలు కొట్టుకుంటారు. రోగగ్రస్తులలా చావకుండా నానా యమయాతనలు పడుతూ వుండాల్సిందే. వాళ్ళను చంపడంలో నా అపారభూతదయ వారికి గోచరం కావడంలే. వాళ్ళ కర్మం. బిగించుకొని నిద్రపోతా" అని నిద్ర ప్రారంభించాడు. నారదుడికి బలే సర్దాగా వుంది. ప్రపంచంలో సృష్టి స్థితి లయాలు ఆగిపోయాయి. అంతా గందరగోళమే. అన్నీ అపసవ్యాలే. అంతా చిందరవందరే. ఆదిశక్తి చూచిం దిదంతా. త్రిమూర్తుల అహానికి ఆశ్చర్యపడ్డది. తన విమానంమీద వాళ్ళ ముగ్గురిని కూర్చుండబెట్టుకొని రివ్వున ఎగిరిపోయింది. త్రిమూర్తులకి ఇటువంటి బ్రహ్మాండాలు అర్బ్బు



దాలు (కోటానుకోట్లు) కనబడ్డాయి. అందులో తమవంటి నవుఖర్లు కోట్లున్నారు. అహం నశించింది. ఆదిశక్తి కాళ్ళమీద పడ్డారు. తమ తప్పుల్ని క్షమించమన్నారు మళ్ళీ ఆమె దీవనలతో యథాప్రకారం సమ్మె అంతరింపజేసి వాళ్ళ పనులలో చేరుకొన్నారు బొంబాయి మిల్లు కూలీలలాగు. ఒకనాడు పెద్ద సభ చేశారు. నారదుడు కలహానికి కారకుడని తెలుసుకొన్నారు. కలహాభోజనుడని ఆయనకి టైటిలు, ప్రారంభం. రంగరత్నలు, రాజహంసలు, రావు బహద్దరులు, దివాను బహద్దరులు నాటినుండే యుత్పన్నమైనాయి. అంతకు పూర్వం బిరుదాలు లేవు. బిరుదాల పూర్వ చరిత్రం యిది. పూర్వం మనవారు రాజ్య తంత్ర ప్రావీణ్య, వీణావైశద్య; కవిసింహ; ఇత్యాది అర్థపూర్వకమైన బిరుదముల నిచ్చేడివారు. ఇప్పుడు బిరుసు ఎంత అర్థం గాకుండ వుంటే అంత గొప్ప. కొందరు బిరుదులు కొనుక్కొని కలకత్తా కంపెనీలనుండి తెచ్చుకొంటూ యున్నారు. కొందరు మిత్రుల చేత సభ చేయించుకొని తగిలించుకుంటూ యున్నారు. ఇక సెలవు" అని గుండెహాడలు శ్యామలరావుగారు సభావేదిక దిగిపోయారు. "అబ్బా! బిరుదల కెంత పూర్వ చరిత్ర వుంది" అని కొందరనుకొన్నారు. బ్రాహ్మడు బాగా చదివాడయ్యా అన్నారు కొందరు. వీడి రిసేర్చిలన్నీ యిలాంటివేనేమో అన్నారు కొందరు విశ్వబ్రాహ్మణులు. వాళ్ళవాళ్లో కూడా తగిన వ్యక్తి కెవరికైన బిరుదు నివ్వాలని వాళ్ళ కోవిధమైన యుత్సాహం జనించింది.

కావలసిన చక్కని యుడుపులు, గుడ్డలు, పలువిధములైన స్వదేశీ సిల్కు చీరలు, జాకెట్టు రకములును

కేశవరామ్ అండ్ కంపెనీ,

1/287, ఎస్ల ప్లనేడ్ రోడ్డు, మద్రాసున దొరకును. మంచి సరకులు! వెల సరసము!